మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు



# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 105 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

మంగళవారం 16 జులై 2024

## రేషన్‌కార్డు లేకున్నా ఆరోగ్యశ్రీ

**- అందరికీ వర్తించేలా సవరణలు - డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయండి**
**- ఆర్ఎంపీ, పీఎంపీలకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలి - దీనిపై అధ్యయనం చేసి కొత్త జీవో విడుదల చేయాల్సిన అవసరం ఉంది - అధికారులకు సిఎం రేవంత్ ఆదేశాలు**

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణలో అవసరం ఉన్న అందరికీ ఆరోగ్య శ్రీసేవలు అందేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేవలం రేషన్ కార్డు ఉన్న వాళ్లకే ఆరోగ్యశ్రీ సేవలు అందించొద్దని అందరికీ సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. ఆరోగ్య శాఖపై సమీక్షలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణలో రేషన్ కార్డు లేకపోయినా సరే ఆరోగ్యశ్రీ సేవలు అందాలని ఆ దిశగా విధి విధానాలు రూపొందించాలని రేవంత్ రెడ్డి సూచించారు. రేషన్ కార్డుకు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింకు పెట్టొద్దన్నారు.



## పాస్‌బుక్ ఆధారంగానే

# రుణమాఫీ

**ఈ నెల 18న రూ.లక్ష లోపు రుణాలు మాఫీ**

**- కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్‌కార్డు నిబంధన**
**- నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు ఆదేశాలు**
**- కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్ వెల్లడి**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
పంట రుణాల మాఫీ విషయంలో రేషన్‌కార్డు నిబంధనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. పాస్‌బుక్ ఆధారంగానే రూ.2లక్షల రుణమాఫీ ఉంటుందని వెల్లడించారు. కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్‌కార్డు నిబంధన పెట్టినట్లు చెప్పారు. ఈ నెల 18న రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఎల్లుండి సాయంత్రంలోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. రుణమాఫీ సంబురాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. రుణమాఫీ నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ల సమావేశంలో రుణమాఫీ మార్గదర్శకాలపై సీఎం వివరించారు. రాష్ట్రంలో పంట రుణాల మాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాల ను విడుదల చేసింది. పథకం అమలు విధి విధానాలను వివరిస్తూ సోమవారం జీవో ఆర్టీ నంబరు 567 ఉత్తర్వులు జారీ చేసింది. ఒక రైతు కుటుంబానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయనుంది. రైతు కుటుంబం గుర్తింపునకు తెల్లరేషన్ కార్డు(ఆహారభద్రత కార్డు)ను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించింది. అన్ని షెడ్యూల్డు, వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా సహకార బ్యాంకుల నుంచి 2018 డిసెంబరు 12 నుంచి మంజూరైన, రెన్యువలైన రుణాలకు, 2023 డిసెంబరు 9 వరకు బకాయి ఉన్న పంట రుణాలకు, స్వల్పకాలిక రుణాలకు ఇది వర్తిస్తుందని... రుణాల అసలు, దానికి వర్తించే వడ్డీని కలిపి రూ.2 లక్షలు మాఫీ అవుతాయని ప్రభుత్వం తెలిపింది. అయితే తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించటంతో విపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రేషన్ కార్డు నిబంధనపై సీఎం స్పష్టత ఇచ్చారు. రూ.2లక్షల రుణమాఫీకి సంబంధించి రేవంత్ రెడ్డి నేతృత్వం లోని తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.. కొన్ని వివరణాత్మక అంశాలతో రుణమాఫీ చేయనున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 2లో..



## మానవీయ కోణంలో చర్య తీసుకోండి

**- తెలంగాణ సంస్కృతిలో మీరు భాగస్వామ్యం కండి**
**- ప్రజలకు కళ్లు చెవుల్లాగా మెదలండి**
**- క్షేత్రస్థాయి పర్యటనలతోనే సమస్యలకు పరిష్కారం**
**- కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి సూచన**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీారేనని కలెక్టర్లతో సిఎం రేవంత అన్నారు. కలెక్టర్లలో వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చినవారు ఉన్నారు కనుక ప్రజల మనసెరిగి ప్రవర్తించాలని అన్నారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అన్నారు. సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు లబ్ది చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యమైతేనే సరైన సేవలు అందించవచ్చన్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 2లో..



### పొలిట్రిక్స్

రానున్నవి శాసనసభలో
వాడి వేడి సమావేశాలు,
మైకులతో కొట్టుకొను
వింత వింత దృశ్యాలు!

అవతలోడు ధీటుగా
పాల్గొంటే ప్రతి చర్చ,
ఫలవంతమే ప్రజలకు
లేదంటే తప్పదు మూర్చ!

- న్యాలకంటి నారాయణ
9346200066

## సైన్యంపై ఉగ్రదాడులు ఆందోళనకరం

**- భద్రతా లోపాలకు ప్రభుత్వానిదే బాధ్యత - దోడా ఘటనపై రాహుల్‌గాంధీ**



న్యూఢిల్లీ (ప్రజా మంటలు):
జమ్మూ కశ్మీర్‌లో దోడా జిల్లాలో చోటుచేసుకొన్న ఉగ్ర దాడిపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. గత కొన్ని నెలలుగా భారత సైన్యంపై ఉగ్ర దాడులు పెరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పరిస్థితికి ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు."నేడు జమ్మూకశ్మీర్‌లో అమరులైన సైనికులకు నివాళి. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను. ఒక దాని తర్వాత మరొకటి ఉగ్రదాడులు జరగడం ఆందోళనకరం. ఈ వరుస దాడులు అక్కడి పరిస్థితులను తెలియజేస్తున్నాయి. భాజపా తప్పుడు రాజకీయాల ఫలితాలను సైనికులు, వారి కుటుంబాలు అనుభవిస్తున్నాయి. ఈ భద్రతా వైఫల్యానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. దేశ సైనికులకు హాని చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. దేశం మొత్తం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలబడాలి" అని రాహుల్ తన ట్విటర్ ఖాతాలో పేర్కొన్నారు.గత 32 నెలల్లో జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడిలో 48 మంది సైనికులు మృతి చెందారు. ఈ నెలలో జరిగిన రెండు దాడుల్లోనే తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరంగా మారింది. గత నెలలో కూడా జరిగిన జంట దాడుల్లో ఆరుగురు సైనికులు కన్నుమూశారు. ఇక గత నెలలోదాడి చేసిన ఉగ్రవాదులు తొమ్మిది మంది పౌరుల ప్రాణాలు తీశారు.



## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

**- అప్రమత్తంగా ఉండాలని సిఎం రేవంత్ ఆదేశాలు - నగరంలో వరదలపై అప్రమత్తం**
**- రంగంలోకి దిగిన అత్యసవర బృందాలు - ములుగు జిల్లాలో భారీ వర్షం**
**- ఉప్పొంగి ప్రవహిస్తున్న జంపన్న వాగు**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
హైదరాబాద్‌లో భారీ వర్ష సూచనలపై ప్రభుత్వం హైఅలెర్ట్ ప్రకటించింది. హైదరాబాద్‌లో ఈ సాయంత్రం నుంచి భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, డీఆర్ఎఫ్ ,

మిగతా 2లో..

### ప్రజా నాడి





## విద్యుత్ కమిషన్ విచారణ జడ్జిని మార్చండి

**- రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం సూచన**
**- కేసీఆర్ పిటిషన్‌పై విచారణ**



న్యూఢిల్లీ (ప్రజా మంటలు):
విద్యుత్ ఒప్పందాల్లో అవకతవకలకు సంబంధించిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ జడ్జిని మార్చాలని సుప్రీం కోర్టు సూచించింది. కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటీషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ నరసింహారెడ్డిని మార్చాలని తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. జస్టిస్ నరసింహారెడ్డి స్థానంలో ఎవరిని నియమిస్తారో చెప్పాలని ప్రభుత్వ తరపు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్విని సుప్రీంకోర్ట్ ధర్మాసనం కోరింది. మెరిట్స్‌పైన జస్టిస్ నరసింహారెడ్డి విలేకరుల సమావేశంలో తన అభిప్రాయాన్ని వెల్లడించడంతో ఆయనను కొనసాగించకూడదని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. కాగా విద్యుత్ కమిషన్ జడ్జిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. మధ్యాహ్నం 2 గంటలకు కొత్త జడ్జి పేరును వెల్లడిస్తామన్న ప్రభుత్వ తరఫు న్యాయవాది సింఘ్వీ సుప్రీంకోర్టుకు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ విచారణ జరిపారు. కేసీఆర్ తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. విద్యుత్ విచారణ కమిషన్ నియామకంలో పరిధిని

మిగతా 2లో..

## అంగన్‌వాడీలకు తీపికబురు

**- పదవీవిరమణ ప్రయోజనం**
**- టీచర్‌కు రూ. 2 లక్షలు, సహాయకులకు రూ. లక్ష**
**- తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణ ప్రభుత్వం అంగన్ టీచర్లు, హెల్పర్లకు గుడ్ న్యూస్ చెప్పింది. పదవీ విరమణ పొందే అంగన్వాడీ టీచర్‌కు రెండు లక్షలు, సహాయకులకు రూ. లక్ష చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని ప్రకటించింది.

మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయి

# పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ

వెల్లడించింది.. దీనికి సంబంధించిన విధి




విధానాలను రూపొందించి.. నోడల్ అధికారి నేతృత్వంలో రూ.2 లక్షల రుణమాఫీ అర్హులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించింది. రేషన్ కార్డు ప్రమాణికంగా ముందుగా స్వల్పకాలిక రుణాలను మాఫీ చేస్తామని చెప్పింది.. రేషన్ కార్డు లేని వారికి ఆధార్ కార్డు ప్రమాణికంగా రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపింది. అయితే..రుణమాఫీ మార్గదర్శకాల విడుదల అనంతరం రాజకీయాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి.. షరతుల్లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి ఇదేంటంటూ అటు బీఆర్ఎస్ .. ఇటు బీజేపీ .. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్ అవుతున్నాయి.. రుణమాఫీ మార్గదర్శకాలతో ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తే.. రేషన్ కార్డు ప్రామాణికతపై ప్రతిపక్షాలు రైతులను రెచ్చగొడుతున్నాయని.. అర్హులందరికీ రుణమాఫీ చేసి తీరుతామని అధికార పార్టీ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే రుణమాఫీకి రేషన్ కార్డు నిబంధనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ సైతం క్లారిటీ ఇచ్చారు. భూమి పాస్ బుక్ ఆధారంగానే కుటుంబానికి రూ.2లక్షల పంట రుణమాఫీ చేస్తామన్నారు. కేవలం కుటుంబాన్ని గుర్తించడానికి మాత్రమే రేషన్ కార్డు నిబంధన పెట్టామన్నారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 18న లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. జూలై 18న సాయంత్రంలోగా రైతుల రుణఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి.. అదే రోజు రైతు వేదికల్లో రుణమాఫీ లబ్దిదారులతో సంబరాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. రుణమాఫీ నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఇతర ఖాతాల్లో జమచేసుకుంటే బ్యాంకర్ల పైన కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం వెల్లడిచింది. ఇదిలావుంటే రుణమాఫీ మార్గదర్శకాలపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది.. ఆంక్షల పేరుతో రుణమాఫీ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందని.. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవడం సరికాదంటూ పేర్కొన్నారు. రేషన్ కార్డ్ తప్పనిసరి నిబంధనతో రైతులకు అన్యాయం జరుగుతుందని.. బీఆర్ఎస్ హయాంలో ఆంక్షల్లేకుండానే రుణమాఫీ చేసినట్లు తెలిపారు. షరతులు లేకుండా రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మొత్తంగా రుణమాఫీ ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని.. పీఎం కిసాన్ నిబంధనలు వర్తింపుతో రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. పీఎం కిసాన్ రూల్స్‌తో సగం మంది రైతులకే మాఫీ జరుగుతుందన్నారు. రైతుల సంఖ్యను కుదించడమే..ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోందని మాజీమంత్రి హరీష్‌రావు అన్నారు.

## మానవీయ కోణంలో చర్య తీసుకోండి



క్షేత్రస్థాయిలో ప్రజల ఆలోచన ఏంటో తెలుసుకోండి. ఏసీ గదులకే పరిమితమైతే మీకు కూడా సంతృప్తి ఉండదు. డిసెంబర్ 24న కలెక్టర్లతో తొలిసారి భేటీ నిర్వహించాం. ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించి లబ్దిదారులను గుర్తించాలని ఆదేశించాం. ఎన్నికల కోడ్ ముగియగానే కలెక్టర్ల బదిలీలు నిర్వహించాం. కలెక్టర్లలో వివిధ రాష్ట్రాలనుంచి ఇక్కడికి వచ్చినవారున్నారు. తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యమైతేనే సరైన సేవలు అందించవచ్చు. తెలంగాణను మీ సొంత రాష్ట్రంగా భావించి పనిచేయాలి. ప్రజలకు లబ్ది చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలి. ప్రజలు ఎప్పుడూ గుర్తుపెట్టుకునేలా పనిచేయాలని రేవంత్ అన్నారు. ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించనున్నారు. 9 కీలక అంశాలతో ప్రభుత్వం ఎజెండా రూపొందించింది. ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం – కాలానుగుణ పరిస్థితులు, ఆరోగ్యం – సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, శాంతి భద్రతలు – ఇతర భద్రతాపరమైన అంశాలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం తదితర అంశాలను అందులో ఉన్నాయి. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. పలు ముఖ్యమైన అంశాలపై అధికారులు వ్యవహరించాల్సిన తీరుపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించి నిజమైన లబ్దిదారులను గుర్తించాలని ఆ సమావేశంలో ఆదేశించామని తెలిపారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో మీ నిర్ణయాలు ఉండాలి. ఒక శంకరన్, ఒక శ్రీధరన్‌లా సామాన్య ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా మీరు పనిచేయాలి. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆలోచన ఏంటో తెలుసుకోండి.. మీ ప్రతీ చర్య ఇది ప్రజా ప్రభుత్వం అని ప్రజలకు తెలిసేలా ఉండాలి. ఈ ప్రజా ప్రభుత్వంలో పారదర్శక ప్రజాహిత పాలన అందించాలి. సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత మీపైనే ఉంది. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే' అని సీఎం స్పష్టం చేశారు. ప్రతీ పేద విద్యార్థి కోసం ప్రభుత్వం ప్రతీ నెలా రూ.85 వేలు ఖర్చు పెడుతోందన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యా వ్యవస్థ అత్యంత కీలకమన్నారు. విద్యావ్యవస్థ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు బదిలీ అయితే.. విద్యార్థులు సొంత కుటుంబ సభ్యుడిలా స్పందించారని... అలాగే కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనితనం ఉండాలని తెలిపారు. ప్రజావాణి సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపైనే ఉందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం అని ప్రజలకు విశ్వాసం కల్పించాలని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, సిఎస్ శాంతి కుమారి, వివిధ జిల్లాల కలక్టర్లు,ఎస్పీలు, ఇతర ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రేషన్‌కార్డు లేకున్నా ఆరోగ్యశ్రీ



తెలంగాణలో అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని... ఆర్ఎంపీ, పీఎంపీలకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలని కూడా సూచించారు. దీనిపై అధ్యయనం చేసి కొత్త జీవో విడుదల చేయాలన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు సీఎం. రూరల్ ఏరియాలో పనిచేసే వైద్యులకు పారితోషకం ఎక్కువ అందించి ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కూడా చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రతీ బెడ్‌కు ఒక సీరియల్ నెంబర్ ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయం అందేలా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి ఆదేశించారు. హాస్పిటల్స్ మెయింటెనెన్స్ కోసం ప్రత్యేక వ్యవస్థ ఉండేలా చూడాలన్నారు. ఇదిలావుంటే ఆరోగ్య శ్రీకి రేషన్ కార్డుతో పని లేకుండా చేసిన సీఎం మిగతా వాటికి కూడా ఇదే సూత్రం వర్తింప జేయాలని మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. ముఖ్యంగా రైతు రుణమాఫీకి కూడా రేషన్ కార్డు ఇతర పత్రాలు లేకుండానే ఇవ్వాలని సూచించారు. రేషన్ కార్డు నిబంధన ఎత్తివేయాలని అన్నారు. రేషన్ కార్డుకు ఆరోగ్య శ్రీ లింకు పెట్టవద్దని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నాం. ఇదే సూత్రాన్ని రైతు రుణమాఫీకి వర్తింపజేయాలనీ రేషన్ కార్డు నిబంధన ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నా. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పాస్ బుక్ నే రుణమాఫీ కి ప్రామాణికంగా?

## విద్యుత్ కమిషన్ విచారణ జడ్జిని మార్చండి

అతిక్రమించారని, ట్రిబ్యునల్స్ ఉండగా, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై ఎలా న్యాయ విచారణ ఎలా వేస్తారని రోహత్గి వాదనలు వినిపించారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో విద్యుత్ సంక్షోభం నేపథ్యంలో విద్యుత్ కొనుగోలు చేశామని, మార్కెట్ రేట్ కంటే తక్కువగా యూనిట్ రూ.3.90లకు మాత్రమే కొనుగోలు చేశారని చెప్పారు. 'నేను మాజీ ముఖ్యమంత్రిని. ఇప్పుడున్న సీఎం ఈ అంశంపై అనేక సార్లు ఆర్‌టీఐ వేశారు. ఇది కక్ష సాధింపు చర్య. విచారణకు ముందే దోషిగా తేలుస్తున్నారు. కమిషన్ ఛైర్మన్ మీడియా సమావేశం పెట్టి మరీ చెప్తున్నారు. రాజకీయ దురుద్దేశ్యంతో చేస్తున్నారు' అని చెబుతున్న కేసీఆర్ వాదనలను ముకుల్ రోహత్గీ వినిపించారు.

## అంగన్‌వాడీలకు తీపికబురు

ఈ మేరకు రహమత్ నగర్‌లో జరిగిన అమ్మమాట – అంగన్ వాడీ బాట కార్యక్రమంలో మంత్రి సీతక్క ప్రకటించారు. రెండు మూడు రోజుల్లో జీవో ఇస్తామని చెప్పారు. అంగన్ వాడీ సిబ్బందికి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామన్నారు. జీవో 10 రద్దు చేయాలని,తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్ వాడీ టీచర్లు,హెల్పర్లు, గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. జూలై 15న సీఐటీయూ ఆధ్వర్యంలోరాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ఎమ్మెల్యేల ముట్టడికి యత్నించారు అంగన్ వాడీలు. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి ప్రకటన రావడంతో అంగన్ వాడీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# సోమవారంలోపు నియమిస్తాం

- సుప్రీం సూచనపై స్పందించిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, (ప్రజా మంటలు):

తెలంగాణలో విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను సోమవారం లోపు నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది.జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ అంశంలో భారాస అధినేత కేసీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కమిషన్ పంపిన సమన్లపై హైకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం తెలిపింది. కమిషన్ ఛైర్మన్‌ను మార్చాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఛైర్మన్‌ను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. భోజన విరామం తర్వాత తదుపరి విచారణ కొనసాగిసామని సుప్రీంకోర్టు తెలిపింది.అయితే భోజన విరామ సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. విద్యుత్ ఒప్పందాలపై విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు న్యాయవాది ద్వారా జస్టిస్ నర్సింహారెడ్డి సుప్రీంకోర్టుకు లేఖ పంపారు. దీంతో ఆయన స్థానంలో మరొకరి నియామకానికి అత్యున్నత న్యాయస్థానం సమయమిచ్చింది. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే కొత్త జడ్జి నేతృత్వంలో కమిషన్ విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. సోమవారంలోపు నూతన ఛైర్మన్‌ను నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీంతో కేసీఆర్ పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్టు సీజేఐ ధర్మాసనం వెల్లడించింది. ఇరుపక్షాల తరఫున సీనియర్ న్యాయవాదులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా.. కేసీఆర్ తరఫున ముకుల్ రోహత్గీ వాదించారు.ఇటీవల బీఆర్‌కే భవన్‌లో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కమిషన్ ఛైర్మన్ రెండుగంటల పాటు సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, ఛత్తీస్‌గఢ్‌తో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఒప్పందం చేసుకున్న సమయంలో నిర్ణయాలు తీసుకున్న కొంతమంది అధికారుల అభిప్రాయాలు తెలుసుకోవాల్సి ఉంది. ఆ సమయంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు అందరికీ లేఖలు రాస్తాం. ఈ విషయంలో ప్రజా అభిప్రాయ సేకరణ ఉంటుంది. సమాచారం అవసరం అనుకున్న వారికి నోటీసులు కూడా అందజేస్తాం. రాజకీయాలకు అతీతంగా విచారణ చేపడతాం, వంద రోజుల్లో నివేదిక సమర్పిస్తాం" అని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి తెలిపారు. ఆ తర్వాత భారాస అధినేత కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారు."విద్యుత్ కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించింది. జస్టిస్ నరసింహారెడ్డి ఏకపక్షంగా ప్రెస్‌మీట్ పెట్టి వివరాలను వెల్లడించారు. ఇది సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధం. విద్యుత్ కొనుగోలు, పవర్ ప్లాంట్ల నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. నోటీసులకు సమాధానం ఇవ్వకముందే జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు" అని కేసీఆర్ తరఫు న్యాయవాదుల వాదన.

# హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షం కురిసినప్పుడు నీళ్ళు నిల్వ ఉండే 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది ఉండి నీళ్ళు వెంటనే వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పొన్నం సూచించారు. తం వర్షం కారణంగా ఇబ్బంది పడిన ప్రాంతాల్లోని ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం కురిసిన సమయంలో లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలని పొన్నం తెలిపారు. పాత భవనాల వద్ద ఉన్నవారిని ఖాళీ చేయించాలని సూచించారు. గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు కురిసినపుడు విద్యుత్ స్తంభాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండేలా విద్యుత్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పోలీస్, జీహెచ్ఎంసీ , హెచ్ఎండీఏ వివిధ విభాగాల అధికారులు ప్రజలు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పని చేయాలని పొన్నం సూచించారు.

**రంగంలోకి దిగిన అత్యసవర బృందాలు**

గ్రేటర్ లో వాతావరణ శాఖ వర్ష సూచన జారీ చేయడంతో క్షేత్ర స్థాయిలో వరద ను ఎదుర్కోవడానికి అత్యవసర బృందాలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు కురిసిన సందర్భంలో వాటర్ లాగింగ్ పాయింట్ వద్ద నీరు నిలిచి ఉండడం తో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అవుతున్న నేపథ్యంలో జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్లు ఎప్పటి కప్పుడు ఆదేశాలు జారీ చేసి అప్రమత్తం చేస్తున్నారు. అంతేకాకుండా సమీక్ష చేసి నిర్లక్ష్యం వహించిన క్షేత్ర స్థాయి అధికారులకు చర్యలకు హెచ్చరించడంతో అప్రమత్తంగా ఉంటున్నారు. తమ తమ పరిధిలో క్షేత్ర స్థాయి అధికారులు వాటర్ లాగింగ్ పాయింట్ లలో నీటి తొలగింపు కోసం నియమించిన మాన్సూన్ ఎమ్జంగ్÷న్సీ బృందాలు లేబర్ ను అప్రమత్తం చేసి నీటిని తొలగించడం జరుగుతుంది. వర్ష ప్రభావం వలన ఫ్లోటింగ్ మెటీరియల్ స్టాటిక్ బృందాలచే క్లీన్ చూపిస్తున్నారు. వర్షం నీరు వరద కాలువలో నిలువకుండా తొందరగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా వాటర్ లాగింగ్ పాయింట్ వద్ద కూడా కొందరు ఒక షెల్టర్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. పబ్లిక్ కు తెలియడానికి బ్యానర్ ఏర్పాటు చేసుకొని ఎప్పుడు వర్షం పడిన మేము సిద్ధం అంటూ తయారయ్యారు. వర్షం పడినప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్ వద్ద నీరు నిలువకుండా వరద ను ఎప్పటి కప్పుడు తొలగించే విధంగా వెహికిల్ కు కూడా సిద్ధం చేశారు. మాన్సూన్ ప్రణాళిక లో భాగంగా జోనల్ వారీగా టెండర్లు పిలవడం జరిగింది. మాన్సూన్ ఎమ్జంగ్÷న్సీ బృందాలు జిహెచ్ఎంసి వ్యాప్తంగా 254 మాన్సూన్ ఎమ్జంగ్÷న్సీ బృందాలు, 238 స్టాటిక్ బృందాలు ఏర్పాటు చేశారు. వీరితో పాటు సి ఆర్ ఎం పి 29, ఈ వి డి ఎం 30 బృందాలు పనిచేస్తున్నాయి. అయినప్పటికీ వరద కాలవలో ఎ÷–లోటింగ్ మెటీరియల్ ను తొలగించి నీరు నేరుగా వెళ్లేందుకు దానితో పాటు వర్షపు నీటి ద్వారా వచ్చిన ఇసుక, మట్టిని తొలిగించి రోడ్డు ను శుభ్రం చేశారు. జిహెచ్ఎంసి పరిధిలో వరద వలన ప్రజలకు ఇబ్బంది కలగకుండా జిహెచ్ఎంసి కమిషనర్ నిర్దిష్ట మైన చర్యలు తీసుకున్నారు.

**ములుగు జిల్లాలో భారీ వర్షం**

రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు జలకళలను సంతరించుకుంటున్నాయి. ములుగు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు జంపన్న వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. జిల్లాలోని ఏటూరు నాగారం మండలంలోని దొడ్ల, మల్యాల గ్రామాల మధ్యన జంపన్న వాగు పొంగి ప్రవహిస్తున్నది. బ్రిడ్జి దాటేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, నిర్మల్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో స్వర్ణ ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. భారీ వర్షాల దృష్ట్యా ప్రాజెక్ట్ గేట్లు తెరిచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వర్షాలు కురిసే సమయంలో చెట్ల కింద ఉండొద్దన్నారు. అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లొద్దని హెచ్చరించారు.

# మీరు చేసిందేంటీ..?

## అధికారం పోతే హక్కులు గుర్తొస్తాయా?

## బెదిరించి చేర్చుకుంటే ఆధారాలు చూపెట్టండి

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్, (ప్రజా మంటలు):



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరించి కాంగ్రెస్‌లో చేర్చుకున్నామంటూ ఆ పార్టీ నేతలు చేసే వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఎమ్మెల్యేని బెదిరించి పార్టీలో చేర్చుకున్నామో ఆధారాలతో సహా నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. 2014 నుంచి 60మంది ఎమ్మెల్యేలను ఏ విధంగా బెదిరించి, ఎన్ని పైసలిచ్చి మీ పార్టీలోకి తీసుకున్నారో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. "ప్రోటోకాల్ విషయంలో కేటీఆర్ ఆవేదన చూస్తే జాలి వేస్తోంది. బీఆర్ఎస్ హయాంలో గవర్నర్, రేవంత్, సీతక్క, కోమటిరెడ్డి లాంటి వాళ్లకి ప్రోటోకాల్ ఇవ్వనప్పుడు కేటీఆర్ ఎందుకు మాట్లాడలేదు. ప్రజలు కుర్చీ పీకేస్తే గానీ రాజ్యాంగం, హక్కులు గుర్తుకు రాలేదు. బీఏసీ సమావేశానికి ప్రతిపక్షాన్ని పిలవనప్పుడు మీకు ప్రోటోకాల్ గుర్తుకు రాలేదా?. తెలంగాణలో మీ పార్టీ జీరో ఎందుకు అయ్యిందో కేటీఆర్ సమాధానం చెప్పాలి. ముందుగా పార్టీల ఫిరాయింపులకు పాల్పడింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. మా పార్టీలో చేరిన 10మంది ఎమ్మెల్యేలు వారి ఇష్టప్రకారమే వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి రైతుకూ రెండు లక్షల రుణమాఫీ చేస్తుంది. 30లక్షల కుటుంబాలకు రూ.31వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేస్తాం. పదేళ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను ఇబ్బందులకు గురిచేసిన పాపం బీఆర్ఎస్ పార్టీదే" అని అన్నారు.

# శ్రీశైలం, సాగర్ నుంచి నీటి విడుదల

- ఏపీకి 4.5, తెలంగాణకు 5.414 టీఎంసీలు కేటాయింపు
- కేఆర్ఎంబీ ఉత్తర్వులు

హైదరాబాద్ (ప్రజా మంటలు):



ఆంధ్రా,తెలంగాణ రాష్ట్రాలకు నీటి విడుదల కోసం కష్ణానదీ యాజమాన్య బోర్డు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలం, సాగర్‌లో ఉన్న 9.914 టీఎంసీలు తెలంగాణ, ఏపీకి కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. త్రిసభ్య కమిటీ నిర్ణయం మేరకు ఏపీకి 4.500 టీఎంసీలు, తెలంగాణకు 5.414 టీఎంసీల నీటిని కేటాయించింది. శ్రీశైలం నుంచి పవర్‌హౌసెస్ ద్వారానే నీరు విడుదల చేయాలని బోర్డు పేర్కొంది. బుధవారం నుంచి నీటి విడుదలకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు అనుమతిచ్చింది. తాగునీటి అవసరాలకే నీటిని వినియోగించాలని కేఆర్ఎంబీ స్పష్టం చేసింది.

# రైతులకు భవిష్యత్తు భరోసాగా ఆయిల్ ఫామ్ తోటల సాగు

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు -ప్రభుత్వం స్థలం కేటాయిస్తే ఫ్యాక్టరీకి సిద్ధం
- కే ఎన్ బయో సైన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి కుశాల్ రెడ్డి









**భీమదేవరపల్లి జూలై 16 (ప్రజామంటలు) :** మండలంలోని ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటి ఆవరణలో మంగళవారం కే ఎన్ బయో సైన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ ఫామ్ తోటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస రావు హాజరైనారు.

ఆయిల్ ఫామ్ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆయిల్ ఫామ్ సాగుచేసే రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, భవిష్యత్తులో ఆయిల్ ఫామ్ 100% భరోసా కల్పిస్తుందని అన్నారు.

**ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి**

వరంగల్, హనుమకొండ జిల్లాలో 7500 ఎకరాలలో ఆయిల్ ఫామ్ తోటలు సాగు అవుతున్నాయని, ఇంకా విస్తీర్ణం పెంచేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. సాగు చేసే రైతులకు మద్దతు ధర కోసం టన్నుకు రూ.15,000/-లు అందించాలని కేంద్ర ప్రభుత్వంపై వివిధ రాజకీయ పార్టీలు ఒత్తిడి తీసుకువస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం ఫాం ఆయిల్ ధర టన్నుకు రూ.13,000/- వరకు ఉందని అన్నారు.

**ప్రభుత్వం స్థలం కేటాయిస్తే ఫ్యాక్టరీ నిర్మాణానికి సిద్ధం**

కె.యన్ బయోసైన్స్ మేనేజింగ్ డైరెక్టర్ కుశాల్ రెడ్డి మాట్లాడుతూ, ములుగు వరంగల్ జిల్లాలలో ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి 500 ఎకరాలకు ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు.

**భీమదేవరపల్లి మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు**

ప్రస్తుతం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో ఫాం ఆయిల్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూమిని కెటాయిస్తే ఈ ప్రాంతంలో ఫాం ఆయిల్ ఫ్యాక్టరిని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇందుకు త్వరలోనే సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిదులతో సమావేశం కానున్నట్లు ఆయన తెలిపారు.

**ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన**

జైన్ కంపెని జనరల్ మేనేజర్ స్టేట్ టెక్నికల్ హెడ్ యస్. భవాని ప్రసాద్ మాట్లాడుతూ, రైతులు ఫాం ఆయిల్ తోటలకు తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులు, డ్రిప్పు ద్వారా ఎరువులు పంపే విధానాన్ని రైతులకు వివరించారు. అనంతరం ఇఫ్కో ఫీల్డ్ ఆఫీసర్, హనుమకొండ జె. అక్షయ్ రెడ్డి ఇఫ్కో కంపెని వారు ములుకనూరు సంఘానికి ఇచ్చిన రెండు డ్రోన్ల పని తీరు గూర్చి వివరిస్తూ, వాటిని సంఘ సభ్యులకు అందుబాటులో సంఘం ప్రధాన కార్యలయంలో అందుబాటులో ఉంచామని, రైతులు వాటిని వినియోగించుకోవాలని సూచించారు.

**"చట్టబద్ధత" ఉన్న ఏకైక పంట ఆయిల్ ఫామ్**

ముల్కనూర్ సొసైటీ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, ఫామ్ ఆయిల్ సాగు చట్టబద్ధతతో కూడుకున్నదని, రైతులు సందేహ పడాల్సిన అవసరం లేదని, మంచి యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడికి కృషి చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖ అధికారిణి మానస, మండల వ్యవసాయ అధికారి యం.డి అఫ్జల్ పాష, సంఘ జనరల్ మేనేజర్ యం. రాంరెడ్డి, సంఘ కార్యవర్గ సభ్యులు, సంఘ వ్యవసాయ అధికారులు మరియు సంఘ సభ్యులు, ఎల్కతుర్తి మండల ఆయిల్ ఫామ్ రైతులు ఎడ్ల రవీందర్ రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.




# జమ్ముకశ్మీర్‌లో మళ్లీ మిలిటెంట్ల కాల్పులు

## - శ్రీకాకుళంకు చెందిన ఇద్దరు జవాన్లు మృతి



శ్రీకాకుళం (ప్రజా మంటలు): జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు జవాన్లు మృతి చెందారు. జవాన్ల మృతితో వారి స్వగ్రామాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జవాన్ల భౌతికకాయాల కోసం బంధువులు, మిత్రులు నిరీక్షిస్తున్నారు. జవాన్ల కుటుంబసభ్యులతో కేంద్రమంత్రి రామ్మోహన్, మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన పోరాటంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గానికి చెందిన జవాన్లు డొక్కరి రాజేశ్, సనపల జగదీశ్వరరావు మృతి చెందారు. జవాన్ల మృతితో వారి స్వగ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. జవాన్లతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని గ్రామస్థులు, మిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పేద కుటుంబంలో పుట్టిన రాజేశ్ సైన్యంలో చేరి దేశానికి సేవలందిస్తున్నందుకు ఎంతో గర్వించామని అతని స్నేహితులు, గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి రాజేశ్ ఎంతో సహాయం చేశారని గుర్తు చేసుకున్నారు. అందరితో కలివిడిగా ఉండే రాజేశ్, ముష్కరులతో పోరాటంలో ఈ ఉదయం చనిపోవడం జీర్ణించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జవాన్ల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. జవాన్ రాజేశ్ కుటుంబసభ్యులతో కేంద్రమంత్రి రామ్మోహన్, మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు.

జమ్మూకశ్మీర్?లోని దోడా జిల్లాలో ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో ఆర్మీ సైనికుల మృతి తీవ్రవ్రగ్భ్భాంతికి గురి చేసిందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు సైనికులు సనపల జగదీశ్వరరావు, డొక్కరి రాజేశ్? మృతి ఎంతో బాధ కలిగించిందని విచారం వ్యక్తం చేశారు. దేశం కోసం, దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన జగదీశ్వరరావు, రాజేశ్?లకు దేశ ప్రజలంతా ఎప్పటికీ రుణపడి ఉంటారని అన్నారు. దేశ ప్రజల రక్షణ కోసం అను నిత్యం పనిచేస్తున్న జగదీశ్వరరావు, రాజేశ్ కుటుంబ సభ్యులకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శ్రీకాకుళానికి చెందిన ఇద్దరు వీర జవాన్లు రాజేశ్, జగదీశ్వరరావులను కోల్పోయినందుకు బాధగా ఉందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. జవాన్ల మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకొస్తున్నామని తెలిపారు.

# ఏపీలో మహిళలకు గుడ్ న్యూస్

- ఆగస్ట్ 15వ నుంచి ఉచిత బస్సు ప్రయాణం
- మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి

అమరావతి (ప్రజా మంటలు): ఏపీలో మహిళలకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఉచిత బస్సు ప్రయాణం అమలు తేదీపై అధికారికంగా ప్రకటించింది. ఆగస్ట్ 15వ తేదీ నుంచి రాష్ట్రంలో మహిళలకు ఫ్రీ బస్ సర్వీస్ అమలు చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. దీంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోన్న ప్రభుత్వం తాజాగా ఈ శుభవార్త అందించింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున విశాఖ వేదికగా సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించే ఛాన్స్ ఉంది. అయితే, మంత్రి కొద్దిసేపటికే ఈ ట్వీట్‌ను డిలీట్ చేశారు. ఇప్పటికే 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' పథకం పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకల్లో విజయవంతంగా అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో పథకం అమలు తీరును అధ్యయనం చేసిన రాష్ట్ర అధికారుల బృందం దీనిపై పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందించారు. పథకం అమలైతే ఆర్టీసీపై పడే భారం, ఆర్థికంగా ఎలాంటి చర్యలు చేపట్టాలి.?, ఎదురయ్యే సమస్యలు వంటి వాటిపై వివరాలను అందులో పొందుపరిచారు. వీటన్నింటినీ పరిశీలించిన సర్కారు రాష్ట్రవ్యాప్తంగా అన్ని రూట్లలోనూ ఆగస్ట్ 15 నుంచి ఈ పథకాన్ని అమలు చేసే దిశగా చర్యలు చేపట్టింది. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను సైతం ఆగస్ట్ 15వ తేదీ నుంచే ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. నిరుపేదలకు రెండు పూటలా కడుపు నింపేలా.. తొలిదశలో 183 అన్న క్యాంటీన్లను ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి ఇప్పటికే అధికారులు క్యాంటీన్ల ఏర్పాటుకు టెండర్లు పిలవగా.. ఈ నెల 22 వరకూ గడువు ఉంది. ఈ నెలాఖరులోగా అన్న క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేసే సంస్థలకు టెండర్లు ఖరారు చేయనుంది. గతంలో ఉన్న అన్న క్యాంటీన్ల భవనాలను రూ.20 కోట్లతో ఇప్పుడు మరమ్మతులు చేస్తున్నారు. అటు, క్యాంటీన్ల నిర్వహణ కోసం దాతల నుంచి విరాళాలు సేకరించాలని సర్కారు భావిస్తోంది. ఇందు కోసం ఓ ట్రస్ట్ ప్రారంభించి.. ప్రత్యేక వెబ్ సైట్ సైతం అందుబాటులోకి తీసుకురానున్నారు. దాతలు ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా, క్యాంటీన్లలో గతంలో కేవలం రూ.5కే ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం అందించేవారు. ఇప్పుడు కూడా అవే ధరలతో భోజనం అందించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నెల రోజుల్లోనే హామీల అమలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తొలుత పింఛన్ల పెంపు, డీఎస్సీ ఉద్యోగాల భర్తీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఉచిత ఇసుక పంపిణీ, అన్న క్యాంటీన్ల ఏర్పాటు వంటి వాటిపై ముందడుగు పడింది. సీఎం చంద్రబాబు.. పింఛన్ జులై 1 నుంచి రూ.4 వేలకు పెంచుతామన్న హామీని వెంటనే అమలు చేశారు. ఏప్రిల్ ఎరియర్లతో కలిపి ఒకేసారి రూ.7 వేలను పింఛనుదారులకు అందజేశారు. అలాగే, ఇటీవల ఉచిత ఇసుక విధానాన్ని సైతం ప్రారంభించి.. ఇందుకు తగిన మార్గదర్శకాలను సైతం విడుదల చేశారు. తాజాగా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలుపైనా ఆదేశాలు జారీ చేశారు.






# ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్ రద్దు

- కొత్త ఇసుక పాలసీకి ఆమోదం
- ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు
- మహిళలకు ఫ్రీ బస్సు అమలుపై ప్రణాళి
- పౌరసరఫరాలశాఖ 2 వేల కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారంటీ
- 22నుంచి అసెంబ్లీ సమావేశాల నిర్వహణ
- ఎపి కేబినేట్ భేటీ నిర్ణయాలను వెల్లడించిన పార్థసారథి

అమరావతి, జూలై 15 (ప్రజా మంటలు): సీఎం చంద్రబాబు అధ్యక్షతన దాదాపు రెండున్నర గంటల పాటు కొనసాగిన కేబినెట్ భేటీలో.. పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఇసుక పాలసీని రద్దు చేసిన ప్రభుత్వం.. కొత్త ఇసుక పాలసీకి ఆమోదం తెలిపింది. త్వరలో కొత్త ఇసుక పాలసీ విధి విధానాలు రిలీజ్ చేయాలని నిర్ణయించింది. ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మరోవైపు మహిళలకు ఫ్రీ బస్సు అమలు చేసే ప్రణాళికలపై కూడా కేబినెట్‌లో చర్చించారు. పౌరసరఫరాల శాఖ 2 వేల కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చేందుకు.. కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం ఎన్సీడీసీ నుంచి 3 వేల 200 కోట్ల రుణానికి ఆమోదం తెలిపింది. పంటల బీమా పథకానికి ప్రీమియం చెల్లింపుపై విధివిధానాలను ఖరారు చేసేందుకు కమిటీ వేయాలని కేబినెట్ నిర్ణయించింది. ముగ్గురు మంత్రులతో కమిటీని నియమించింది. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు. ఈ నెల 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఈ మధ్య ప్రభుత్వం వరుసగా రిలీజ్ చేసిన శ్వేతపత్రాలను కూడా అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రభుత్వ విధానాలు, పనితీరుపై కొత్త మంత్రులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని సూచించారు సీఎం చంద్రబాబు. లోటు బ్జడెట్ ఉందని గ్రహించి మంత్రులు పనిచేయాలని.. శాఖలకు సంబంధించిన అంశాలపై ప్రతినెలా సమీక్ష చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ల్యాండ్ అండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ మంత్రివర్గ సమావేశం నిర్ణయించిందని మంత్రి పార్థసారథి వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి మీడియాకు వెల్లడించారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై అనేక సందేహాలు ఉన్నాయని తెలిపారు. ఈ చట్టాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలే అమలు చేయలేదని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎవరితో చర్చించకుండానే చట్టాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. నీతిఅయోగ్ ప్రతిపాదిత చట్టానికి, గత ప్రభుత్వం తెచ్చిన చట్టానికి సంబంధం లేదని వివరించారు. ఈ చట్టం వివాదాలను పెంచే విధంగా ఉందని, ప్రజలకు మేలు చేసేదిగా లేదని అన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ల్యాండ్ రికార్డ్సు వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసేందుకు చట్టాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో ఉచిత ఇసుకపై కమిటీ వేసి పర్యవేక్షణ చేయడానికి మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని అన్నారు. ఇసుకపై గత ప్రభుత్వం కోర్టులకు తప్పుడు సమాచారం ఇచ్చిందని అన్నారు. పాత ఇసుక విధానం, పలు ఒప్పందాలు రద్దు చేశామని తెలిపారు. రాష్ట్రంలో కౌలు రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. కౌలు రైతుల సమస్యలపై పూర్తిగా అధ్యయనం చేసిన తరువాత స్పష్టమైన విధానాన్ని తీసుకువస్తామన్నారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించి ప్రపంచానికి ఒక ఆదర్శవంతమైన సాగును అందుబాటులోకి తీసుకు రానున్నామని వివరించారు. దాదాపు రెండున్నర గంటల పాటు కొనసాగిన మంత్రి వర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, సీఎస్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సమస్యలపై నిలదీయాల్సిందే !

వచ్చే పార్లమెంట్ సమావేశాలు అందరికీ కీలకమే. బడ్జెట్ సమావేశాలు కావడంతో కేటాయింపులపై అన్ని రాష్ట్రాలు ఎదురుచూస్తున్నాయి. అలాగే వేతన జీవులు ఇన్‌కమ్ ట్యాక్స్ స్లాబుల కోసం ఎదురు చూస్తున్నారు. గత పదేళ్లుగా ఈ సమస్యను పక్కదారి పట్టించి నిర్మలా సీతారామన్ గారడీ విద్యను ప్రదర్శించారు. అలాగే జీఎస్టీ స్లాబులను తగ్గించాల్సి ఉంది. అనేక రకాలైన సరుకులపై ఇబ్బడిముబ్బడిగా జీఎస్టీ వేస్తున్నారు. హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలపైనా ఇష్టారాజ్యంగా జీఎస్టీ వాయిస్తున్నారు.
వ్యాపారులు జీఎస్టీ తదితర వెసలుబాటు కోసం చూస్తున్నారు. ఇవన్నీ కూడా చర్చించాలి. ఎంపిలు ఈ విషయాలను అవగాహన చేసుకుని, ప్రజలపై పడుతున్న భారాలపై పార్లమెంట్ వేదికగా చర్చ చేయాలి.
ఇదే క్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలు కూడా కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్నాయి. విభజన సమస్యలపై ఉమ్మడిగా పోరాడాలన్న సంకల్పం ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య కనిపిస్తోంది. ఇటీవలే ఇరు రాష్ట్రాల సిఎంలు రేవత్ రెడ్డి, చంద్రబాబులు కలిసి చర్చించుకున్నారు. అలాగే కేంద్రం కూడా అనేక విషయాల్లో హామీలను నెరవేర్చాల్సి ఉంది. నిజానికి చట్టబద్ధంగా రావాల్సిన అనేక అంశాల విషయంలో కలిసి పోరాడాలన్న అభిప్రాయం గతంలో పాలించిన తెలుగు రాష్ట్రాల సిఎంలు ప్రకటించ లేదు. కేంద్రం కూడా ఇరు రాష్ట్రాలపై బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తూ వచ్చింది. కానీ ఇప్పుడలా చేయడానికి లేదు. సమస్యలను దాటవేయడం ఇక కుదరదు.
పార్లమెంట్ సమావేశాలు జరుగబోతున్న క్రమంలో తాజాగా ఇప్పుడు ఇరు రాష్ట్రాల సిఎంలు సమస్యలపై ఉమ్మడి అవగాహనకు రావాలి. చట్టసభల్లో ప్రభుత్వాన్ని కలసికట్టుగా నిలదీసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి. ముందుగా విభజన సమస్యలను గుర్తించి వాటిని పార్లమెంట్ ఉభయసభల్లో నిలదీయాలి. కేంద్రం సమస్యలను పరిష్కరించడం లేదన్న విషయాన్ని దేశం దృష్టికి తీసుకుని రావాలి. సమస్యలను గట్టిగా నిలదీయలేక పోవడంతో కేంద్రం కూడా ఇంతకాలం ఉదాసీనంగా ఉంటోంది. రాష్ట్రాలను ఉద్ధరించామన్న ధోరణిలో ఉంది. ఈ క్రమంలో కేంద్రం చూసీచూడ నట్టుగా వ్యవహరిస్తోంది. అంతేకాకుండా చట్టబద్ధంగా రావాల్సిన నిధులను కూడా ఉదారంగా ఇచ్చినట్లుగా ప్రకటించుకుంటోంది. అలాగే నిధుల విషయంలో నిక్కచ్చిగా ఉండాలి. కేంద్ర పథకాల నుంచి వచ్చిన డబ్బుల పైనా జవాబుదారీతనం చూపాలి. కేంద్రం ఏయే పథకాల కిద ఎంతెంత డబ్బులు ఇస్తూ వచ్చిందో తెలుగు రాష్ట్రాల సిఎంలు ప్రకటించాలి. ఈ క్రమంలో విభజన సమస్యల విషయంలో ఉమ్మడి పోరాటానికి సిద్ధంకావాలి. ముఖ్యంగా ఎపిలో ఎన్‌డిఎ కూటమి సర్కార్ ఉన్నందున స్నేహపూర్వక వాతావరణంలో అయినా కేంద్రంతో పోరాడాలి. అలాగే ఆర్థికరంగం దివాళా తీస్తున్నా నగదు బదిలీ పథకాలను ఎంతమాత్రం కొనసాగించడం సరికాదు. ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన వెనుకబడ్డ ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీ, ఏపీ ఆర్థిక లోటు భర్తీ గురించి గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డి ఎక్కడా ప్రస్తావించ లేదు. ఆంధ్రుల హక్కుగా నిర్మాణం జరిగిన విశాఖ ఉక్కు ప్రైవేటీ కరణ నిలిపి వేతకు కూడా జగన్ ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయలేకయింది. ఈ క్రమంలో ప్రైవేటీకరణను ఆపేయడంతో పాటు, దానికి నిధులు కేటాయించి బలోపేతం చేయించే బాధ్యతను టిడిపి, బిజెపిలు ఉమ్మడిగా తీసుకోవాలి. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. ఇంతకాలం విశాఖ ఉక్కు కార్మికులకు కేంద్రం భరోసా ఇవ్వలేకపోయింది. ఫలితంగా కార్మికులు ఆందోళన మార్గం వీడలేదు. విశాఖ ఉద్యమాన్ని రాజకీయకోణంలో కాకుండా కార్మికుల డిమాండ్లకు పరిష్కారం చూపే విధంగా నడచుకోవాలి. ప్రత్యేక హోదాను గత ప్రభుత్వం కేంద్రానికి తాకట్టు పెట్టింది. పోలవరం ప్రాజెక్టును అటకెక్కించారు. అదిగో... ఇదిగో అన్న ప్రాజెక్టు పనులను
నత్తనడకలా చేశారు. భారీ వర్షాలు కురిసి నీరు వృధాగా పోతున్నా మరో రెండేళ్లలోను పోలవరం పూర్తి అవుతుందన్న నమ్మకం లేకుండా చేశారు. గతంలో 77 శాతం పూర్తి చేసిన పోలవరం పనులను ఐదేళ్ళ పాలనలో మరో పది శాతం కూడా పూర్తి చేయలేక పోయారు. దీనిపై కేంద్రాన్ని నిలదీసే పరిస్థితి లేకుండా అధికశాతం లెక్కలు వేసి కేంద్రం మొండికేసేలా చేశారు. వివిధ అంశాలపై పార్లమెంటులో పోరాడాలని నిర్ణయించినందున, అందుకు సన్నద్ధంగా ఉండాలని లెఫ్ట్ తదితర పార్టీలో కోరుతున్నాయి. పోలవరం, విశాఖ ఉక్కు,రాజధానిపై స్పష్టమైన వైఖరితో ముందుకు సాగాల్సి ఉంది. ఐదేళ్లుగా రాజధాని లేని రాజ్యంగా ఎపి వెలుగొందుతోంది. మూడు రాజధానులు అంటూ ఆంధ్రుల రాజధాని అమరావతిని దేశ ప్రజల ముందు నవ్వులపాలు చేశారు. మొత్తంగా ఇరు రాష్ట్రాలకు సంబంధించి అనేక సమస్యలు ఇప్పుడు కేంద్రం ముందున్నాయి. బయ్యారం ఉక్కు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, భద్రాచలంలోని విలీన మండలాలు, నిధుల కేటాయింపు తదితర అంశాలన్నీ పరిష్కరించాల్సి ఉంది. అలాగే పోలవరం, అమరావతి, కడప ఉక్కు, భోగాపురం ఎయిర్‌పోర్టువంటివన్నీ త్వరగా పూర్తి చేసుకోవాల్సిం ఉంది. రోడ్ల విస్తరణ,ట్రిపుల్ ఆర్ రహదారి నిర్మాణం తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో కేంద్రం కూడా ఉదారంగా వ్యవహరిం చాలి. అభివృద్ధిపై దృష్టి సారించేలా నిధుల కేటాయింపులు చేయాలి. అలాగే విభజన సమస్యలపై కమిటీ ఇచ్చిన సూచనలు పాటించాలి. ఇరు రాష్ట్రాల సిఎంలతో కలసి చర్చించి పరిష్కారానికి చొరవ చూపాలి. ఇప్పటికే పదేళ్లు గడిచాయి. ఇంకా తాతత్సారం చేయడం ఎంతమాత్రం మంచిది కాదని గుర్తించాలి. గతానికి భిన్నంగా మోడీ తన పాలనా తీరును ముందుగా మార్చుకుంటే తప్ప వీటిని సమస్యలుగా గుర్తించ లేరు.





## గుడినే బడిగా మారుద్దాం..!

"నాన్న గుడి బడి రెండు ఒకటే అంటారు నిజమేనా?" అని అడిగాడు సింబ వాళ్ళ నాన్నను.
"నీకెందుకొచ్చింది రా అంతపెద్ద సందేహం "అన్నారు వాళ్ళ నాన్న ."లేదు ఈరోజు మా తరగతిలో వచ్చిన సంస్కృత పాఠంలో ఈ వాక్యం రాసి ఉంది, దీనికి ఉదాహరణ చెప్పమంటే ,మీ ఇంట్లో పెద్దలను అడగండి వాళ్ళే మీకు విపులంగా చెబుతారు అన్నారు మాష్టారు,అందుకని" అన్నాడు ప్రశ్న మార్కుకు ముఖముతో.

సరే రేపు సెలవు కదా మనం ఉదయాన్నే టిఫిన్ చేసి ఒక చోటుకు వెళదాం అన్నారు నాన్న. అదేంటి నేను ఒకటి అడిగితే మీరు ఇంకోటి చెబుతున్నారని అనుకోని అలాగే ఉదయాన్నే సిద్ధమయ్యాడు సింబ.
నాన్న తో పాటు స్కూటర్ ఎక్కి వెళ్ళాడు. ఇద్దరూ కలిసి అగ్రహారం లోని రాముల వారి గుడికి వెళ్లారు.
అక్కడ రాముల వారిని దర్శనం చేసుకొని , ప్రసాదం రెండు దొప్పల్లో తీసుకొని ఒక పక్కన కూర్చున్నారు.

అక్కడ ఏం చేయడానికి పిలుచుకు వచ్చారో అర్థం కావడం



లేదు సింబాకు కొద్ది సేపటికి ఆ గుడి అరుగు
పై ఆ ప్రాంత పిల్లలు అందరూ ఒక్కొక్కరుగా వచ్చి కూర్చున్నారు. వారితో పాటూ అక్కడికి మరో ముగ్గురు తలపండిన పెద్ద వాళ్ళు కూడా వచ్చారు. "ఎవరు నాన్న వీళ్లంతా "అన్నాడు సింబ.
కాసేపు ఆగమన్నట్టు సైగ చేసాడు వాళ్ళ నాన్న.
ఇలా కాసేపటికి అందరూ అక్కడికి చేరుకున్నారు.

అందులోని ఒక పెద్దాయన వారిని ఉద్దేశించి "ఈ వారం మనం అనుకున్న పనిని చాలా చక్కగా పూర్తి చేసాం , ఇదే విధంగా వచ్చే వారానికి కూడా ప్రణాళిక సిద్ధం చేసుకుంటే మనం అనుకున్న లక్ష్యం వైపుకు చేరుకోవచ్చు"అంటూ ముగించాడు.

ఇంతలో రెండవ వ్యక్తి లేచి మీరు మీ పాఠశాలలో చదువు కుంటూనే సాయంత్రం వేళల్లో మీ సమీపంలోని చదువు రాని వాళ్లకు సంతకం చేయడం
నేర్పించాలి, ఇది ఈ వారం మన పని"అంటూ అక్కడినుండి వెళ్లిపోయారు.

అసలు అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాని సింబ వాళ్ళ నాన్న వైపు చూసాడు. "ఇప్పుడు మనం చూసింది ఒక ప్రాంతం ప్రజలను వాళ్ళు ఈ గుడికి వస్తూ వస్తూ మానవ సేవే మాధవ సేవ అని నమ్మి కేవలం దైవాన్ని కొలవడం మాత్రమే కాకుండా , సాటి మనుషులలో ఆయన్ను చూస్తూ వారికి తమకు చేతనైన సహాయం చేస్తున్నారు.

వీరే కాదు ఇంకా చాలా మంది ఇలా బడిలో చెప్పే పాఠాలను బయట సమాజానికి ఉపయోగ పడేలా చేస్తున్నారు.గుడిలో దేవుడు కూడా అందరి మంచి కోరతాడు, అందరికీ పంచమంటాడు, మంచి మాటలు ప్రవర్తన కలిగి ఉండాలంటాడు. ఇవే విషయాలే కదా మనకు పాఠశాలలో కూడా చదువులలో ఉండే అంతరార్థం.

ఇవన్నీ విన్న సింబ "అవును నాన్న గుడి బడి రెండూ ఒకటే అందరినీ ఒక్కటిగా చూడమంటాయి, మంచిగా ఉండాలంటాయి . అవును గుడి బడి రెండూ ఒకటే నేర్పుతాయి" అన్నాడు.అలాగని రోజూ ఇక్కడే ఉండి బడికి పోనంటే కుదరదు అన్నాడు నవ్వుటూ నాన్న . ఇద్దరూ ఇంకో దొప్ప ప్రసాదం తీసుకొని ఇంటికి బయలు దేరారు.

సింగంపల్లి శేష సాయి కుమార్,
రాజంపేట,, 863963590

## భగ్న బంధం

సఖా!
నీవే నా ప్రాణమంటూ
నువు చేసిన బాసలు నమ్మి,
కంటికిరెప్పలా కాచిన
కన్నవారిని కాదని
నీతో నా నవజీవనం
సుందరమనుకుని
మధురోహలలో విహరిస్తూ,
వేదమంత్రాల నడుమ
నీవు కట్టిన పుస్తెతో ముడిపడిన
జీవితమిక మంగళ
ప్రదమనుకుంటూ,
నీ చిటికెన వేలు పట్టుకుని
నీ వెంట కదిలాను.

నీకై అభిరుచుల్ని మార్చుకొని,
కోరికలను పంటి బిగువున పట్టి
నాలోని ప్రతిభను
నాలుగు గోడల మధ్యే బందీని
చేసి,
ఆశయాలను సమాధి చేసుకొని
వంటింటి కుందేలుగా మారి,
నీ ఆశలు నెరవేరుస్తున్న
సహధర్మచారిణిని.

కానీ నువ్వు చేస్తున్నదేంటి?
నీకై కన్నవారందరినీ వదిలి
వచ్చిన
నన్ను కాదని
పరవనితల వెంట
పడుతున్నావే...
ధర్మార్థ కామములలో ఏనాడూ
విడవనని,
కష్టసుఖాల్లో తోడూనీడవుతానని,
నాతిచరామి అంటూ చేసిన
పెళ్లినాటి ప్రమాణాలు
ఏమైనాయి?
మంత్రాల అర్థం తెలియక
మరిచావా?
అర్థమే వ్యర్థమనుకున్నావా?

నీతో తెగతెంపులకు సిద్ధపడే
తెగువున్నా
నీపై ప్రేమను చంపుకోలేక...
బిడ్డ భవితపై ప్రభావం
పడనీయలేక...
కాలమే గుణపాఠం
చెబుతుందని ఆశిస్తున్నా
పశ్చాత్తాపం కలిగి మారతావని
ఎదురుచూస్తున్నా...

నమ్మకం వమ్మవుతున్న వేళ,
సహనం నశించిన వేళ,
ఎంతకాలమని సహించను నీ
దాష్టీకాన్ని?
గుర్తుచేసుకో ఆనాటి
ఆప్యాయతలు,
మంచి భర్తగా మసలుకో.

వేమూరి శ్రీనివాస్
9912128967
తాడేపల్లిగూడెం

## వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.
mantalukathalu@gmail.com
-ఎడిటర్

# "పండగలకు అబ్బాయిలకు బోణీ తొలి ఏకాదశి"



తిథులు అన్నింటిలోకి ఏకాదశి తిథి పరమ పవిత్రమైనది. ప్రతి మాసంలో 15 రోజులకు ఒకసారి వచ్చే ఏకాదశి ఉపవాసాల దినం.
"గృహస్థో బ్రహ్మచారి చ ఆహితాగ్నిస్త దైవచ, ఏకాదశ్యాంశ భంజిత పక్షయోరు భయో రపి" అని అగ్ని పురాణాదులు స్పష్టం చేస్తున్నాయి. గృహస్తులకు, బ్రహ్మచారులకు, నిత్యాగ్ని హోత్రులకు సైతం నిమిత్తమైన కర్మగా, ఉపవాసాద్యాచరణము విధించ బడినది. ఏకాదశి దినం శ్రీమహా విష్ణువుకు ప్రీతిపాత్రమైన "హరివాసము" అని కొనియాడారు బడుచున్నది. ఉత్తరాయణంలో కంటే దక్షిణాయనంలో పండుగలూ పబ్బాలూ అధికం. ఆరోగ్య పరిరక్షణార్థం నియమాలు ఎక్కువగా పాటించాల్సి ఉండడం చేత, నియమ పాలనార్థం పూర్వీకులు వ్రతాలు, ఉత్సవాలు ఎక్కువగా నిర్దేశించారు. అలాంటి పండగలకు, పబ్బాలకు "బోణీ" వంటిది ఆషాఢ శుక్లపక్ష ఏకాదశి. చాతుర్మాస్య దీక్షా దినాల ఏకాదశులలో మొదటిది కావడం చేత "తొలి ఏకాదశి"గా నామాంతరం గల దినమైనది. "ప్రథమైకాదశి" అను సంస్కృత నామాన్ని బట్టి తెలుగు వారు దీనిని తొలి ఏకాదశి అని వ్యవహరిస్తున్నారు. తర్వాత రాగల పండుగలకు పబ్బాలకు ఇది తొలిది. నిష్టా పరులకు సనాతన సాంప్రదాయ ఆచరణ ఆసక్తులకు ఇది ఉపవాస దినం. ఈనాటి నుండి నాలుగు మాసాల పాటు ప్రతి దినం పురాణ గ్రంథాలు పఠించడం సదాచారంగా వస్తున్నది. అన్ని ఏకాదశులలోకి ఆషాఢ శుక్ల ఏకాదశి మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్ర మైనదిగా భావించ బడుతున్నది.
కృతయుగంలో మురాసురుడనే రాక్షసుడు.. బ్రహ్మ వరంతో దేవతలను, రుషులను హింసించాడని, ఆ రాక్షసుడితో మహా విష్ణువు వెయ్యేళ్లు పోరాడి, అలసిపోయి ఓ గుహలో విశ్రాంతి తీసుకుంటుండగా.. శ్రీహరి శరీరం నుంచి ఓ కన్య ఆవిర్భవించి, ఆ రాక్షసుణ్ణి అంతం చేసిందని, ఇందుకు సంతోషించిన శ్రీమహా విష్ణువు ఆ కన్యను వరం కోరుకోమనగా.. తాను విష్ణుప్రియగా లోకం చేత పూజలు అందుకోవాలని కోరుకాగా, నాటి నుంచి ఆమె 'ఏకాదశి' తిథిగా వ్యవహారంలోకి వచ్చిందని, అప్పటి నుంచి సాధువులు, భక్తులు 'ఏకాదశి' వ్రతం ఆచరించి విష్ణుసాయుజ్యం పొందినట్లుగా పురాణ కథనాలు. ఈరోజు మొదలుకొని విష్ణుమూర్తి నాలుగు నెలలపాటు, పాతాళ లోకంలో బలి చక్రవర్తి ద్వారం వద్ద ఉండి, కార్తీక శుక్ల ఏకాదశి నాడు వెనక్కి తిరిగి వస్తారని చెబుతారు. అలాగే ఈ దినం విష్ణుమూర్తి, నాలుగు నెలల పాటు క్షీర సముద్రంలో శేష సాయిపై పండుకొని, కార్తీక శుక్ల ఏకాదశి నాడు మేల్కొంటారని అని పురాణాలు వివరిస్తున్నాయి. గదాధర పద్ధతి దీనిని "హరి శయనం" అంటున్నది. అలాగే "దేవ శయని ఏకాదశి" అని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ దినంతో ప్రారంభించి, మహావిష్ణువు నాలుగు నెలలపాటు క్షీర సముద్రంలో శయనించి, కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేల్కొంటాడని, పురాణాలు చెబుతున్నాయి. అందులకే దేనికి "దేవ శయన ఏకాదశి" అని, "శయనైకాదశి" అని పేర్లు కూడా ఉన్నాయి. వైష్ణవాలయాలలో ఈ దినం నాడు విగ్రహాలను, ఆభరణాలతో అలంకరించి పూజించడం ఆచారం. ఆషాఢ మాస శుక్ల ఏకాదశినాడు ఉపవాసం ఉండి చాతుర్మాస్య వ్రత కల్పం ప్రారంభించాలని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు చెప్పినట్లు గ్రంథస్తం.
బ్రహ్మ వైవర్త పురాణ ఆధారంగా చాతుర్మాస్య దీక్షను ఆషాఢ శుద్ధ ఏకాదశితో ప్రారంభించి, విష్ణుమూర్తి పూజలు చతుర్మాస్య వ్రతం మొదలుకొని ఏకాదశి, ద్వాదశి, అమావాస్య, పౌర్ణమి, కర్కాటక సంక్రాంతి, పర్వదినాలలో ఉపవాస దీక్షలో ఉంటూ, కార్తీక శుక్ల ఏకాదశి వ్రతం పూర్తి చేయడం ఆచారం. పిప్పల వృక్ష ప్రదక్షణలు, దేవాలయాలలో దీపారాధనలు, చాతుర్మాస్య ఆచరణలో ప్రధానాలు. చాతుర్మాస్య దీక్షా పరులు, సరస్వతి దేవిని కూడా



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494


పూజించడం, కొన్ని చోట్ల ఆచారంగా ఉంది.
తెలుగు దేశపు వ్యవహారాల ప్రకారం గుంటూరు మండలంలో కొన్ని ప్రాంతాలలో దీనిని "పేలపిండి ఏకాదశి" అంటారు. పేలాలు విసిరి పిండి చేసి, బెల్లంలో కలుపుకొని తింటారని ఆ పేలాల పిండి మీద కూడా ఆచారంగా కొనసాగింది. ఉభయ గోదావరి మండలాల్లో మాగాణి గ్రామాల్లో రైతులు ఈ దినం నాడు కొత్త పాలేర్లను కుదుర్చు కుంటారు. ఆ ప్రాంతాల్లో వాళ్లకు తొలి ఏకాదశి దానికి ముందు దినాలు, ఆటవిడుపు సమయాలు. తొలి ఏకాదశి నాడు కానీ, తర్వాత ఈ రోజున కానీ, కొత్త పాలేరులకు కొత్త బట్టలు, కొత్త కర్రలు ఇచ్చి, పిలిచి పిండి వంటలతో భోజనాలు పెట్టడం కూడా ఆచారంగా ఉన్నట్లు కొన్ని గ్రంథాలు పేర్కొంటున్నాయి.
"ఏరు ముందా"... "ఏకాదశి ముందా" అని నెల్లూరు జిల్లాలో ఒక సామెత ఉంది. ఆషాడం నుండి మేఘోదయం అగు చుండుట చేత, ఏరువాక పనుల ప్రారంభించేవారు. ఏటి నీటి కోసం ఎదురు చూడడం, సామాన్యంగా ఆషాడ శుక్ల ఏకాదశి వరకు నీటి వనరులలో కొత్తనీరు రావడం కద్దు. అందుచేత ఏరు, ఏకాదశి పందెము వేసుకొని "నేను ముందా... నీవు ముందా" అని పోటీ పడతాయని అలంకార ఉక్తి ఒక సామెతగా వాడుకలో ఉంది. ఏకాదశి వ్రతాలను ఏకాదశి పర్వదినం తో ప్రారంభించి 11 ఏకాదశుల వ్రతాచరణ సదాచారమై ఉంది. సౌభాగ్యానికి సుఖ సంతోషాలకు ఏకాదశి దేవత అనుగ్రహ సిద్ధికై సువాసినులు సామూహిక ఏకాదశి వ్రతాలను ఆచరించడం

# పార్టీమారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించండి

- ఫిరాయింపులను కట్టడి చెయ్యండి
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించండి
- స్పీకర్‌ను కలిసిన బీఆర్ఎస్ బృందం



హైదరాబాద్, (ప్రజా మంటలు):
పార్టీ ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, పార్టీలో ఎమ్మెల్యేల బృందం స్పీకర్‌ను కలిశారు. ఈ మేరకు స్పీకర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ..తమ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు పార్టీ మారారని తెలిపారు. స్పీకర్ ఆరు మాసాల్లోపు పార్టీ ఫిరాయింపుల ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. మణిపూర్‌లో ఓ ఎమ్మెల్యేను అలాగే డిస్ క్వాలిఫై చేశారని తెలిపారు. అనర్హతపై నిర్ణయాధికారం స్పీకర్‌కే ఉన్నప్పటికీ మూడు నెలల లోపు నిర్ణయం తీసుకోవాలని చెప్పిందని కేటీఆర్ అన్నారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుని రాహుల్ గాంధీ ఫోజులు కొడుతూ.. బయట ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. హర్యానాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే బీజేపీలో చేరితే అక్కడ ఫిరాయింపులపై కాంగ్రెస్ పోరాడుతోందని అన్నారు. గోవాలో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పార్టీ మారబోమని ప్రమాణం చేయించారన్నారు. పార్టీ ఫిరాయింపులు అనైతికమని స్పీకర్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారన్నారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని పిటిషన్ ఇచ్చామని కేటీఆర్ తెలిపారు. స్పీకర్ ఆ పది మందిపై అనర్హత వేటు వేస్తారని నమ్మకం ఉందన్నారు. కడియం శ్రీహరి ముందు నుంచే కోవర్ట్‌గా ఉన్నారని అనుమానం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఓడిపోయిన అభ్యర్థులు కార్యక్రమాలు చేస్తున్నారని.. అధికారులు వారిని స్టేజి మీద కూర్చోబెడున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... పార్టీ కండువాలు కప్పుకుని ఓడిన అభ్యర్థులు చెక్కులు పంపిణీ చేస్తున్నారన్నారని సబిత అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు రివ్యూ చేస్తే వచ్చే అధికారులను సస్పెండ్ చేస్తున్నారని తెలిపారు. 'ఇదేనా ప్రజాస్వామ్యం.. పాలన ఎటువైపు పోతుంది' అని ప్రశ్నించారు. ప్రజల పక్షాన పోరాడితే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. తమ హక్కులను పరిరక్షించాలని స్పీకర్‌ను కోరినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇలా జరక్కుండా చూడాలని విజ్ఞప్తి చేశామని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత పద్మారావు అన్నారు. ప్రారంభాలకు, చెక్కుల పంపిణీకి ఓడిన అభ్యర్థులను అనుమతి ఇస్తున్నాం న్నారు. మరి ఓడిన అభ్యర్థులను అసెంబ్లీలోకి కూడా అనుమతిస్తారా అని స్పీకర్‌ను అడిగినట్లు తెలిపారు. కాగా... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో స్పీకర్‌ను పార్టీ ఎమ్మెల్యేలు కలిసి వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ పాటించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఎమ్మెల్యేలు వినతి పత్రం ఇచ్చారు.



# సిఎం రేవంత్‌తో భూపేశ్ భగేల్ భేటీ

హైదరాబాద్, (ప్రజా మంటలు):
సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ నేత, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఇరువురునేతలు పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా రైతురుణమాఫీపై సిఎం రేవంత్ రెడ్డి మాజీ సిఎం భగేల్‌కు వివరించినట్లు తెలుస్తోంది. అలాగే చత్తీగడ్‌లో ధాన్యం సేకరణ, రైతులకు సాయం తదితర అంశాలను అడగి తెలుసుకున్నట్లు సమాచారం.

# ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా స్పందించలేదేం?

- అధికారుల నిర్లక్ష్యవైఖరిపై మండిపడ్డ మంత్రి శ్రీధర్‌బాబు
- తక్షణం భూకబ్జాలపై దృష్టి పెట్టాలని ఆదేశం



హైదరాబాద్ (ప్రజా మంటలు):
హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా అధికారులు స్పందించకపోవడంపై ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ప్రాంతాల్లో రూ.కోట్లు విలువైన భూములను కబ్జాదారులు ఆక్రమించారని ఉన్నతాధికారులకు ఆయన లేఖ రాశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఫిర్యాదుతో అధికారులను మంత్రి శ్రీధర్‌బాబు అప్రమత్తం చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదును ప్రస్తావిస్తూ ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఉదాసీనత ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పురపాలక, పట్టణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎండీ, హెచ్ఎండీఏ కమిషనర్లకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఖానామెట్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 41/14లోని 252.24 ఎకరాల భూమి ఉండగా 2008లో అప్పటి ప్రభుత్వం 180.13 ఎకరాలను హెచ్ఎండీఏకు కేటాయించింది. అందులో నుంచి 75 ఎకరాలను పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థకు హెచ్ఎండీఏ బదిలీ చేసింది. హుడా ఆధీనంలోని 105.13 ఎకరాలు, టీజీఐఐసీ యాజమాన్యం ఆధీనంలోని 75 ఎకరాల్లో అత్యధిక భాగం కబ్జాదారుల ఆధీనంలోకి వెళ్లిందని శ్రీధర్‌బాబు తెలిపారు. శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామంలోని 100, 101 సర్వే నంబర్లలోని 100 ఎకరాల భూమిపై కబ్జా యత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజావసరాలకు ఉపయోగపడాల్సిన విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఉన్నతాధికారులు ప్రణాళిక రూపొందించి తక్షణం రంగంలోకి దిగాలని సూచించారు. నిర్దిష్ట కాలవ్యవధిలో సమీక్షలు నిర్వహించి క్షేత్ర స్థాయి సిబ్బందికి బాధ్యతను నిర్దేశించాలని చెప్పారు. ఆక్రమణల సమాచారం ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత

దిల్లీ (ప్రజా మంటలు):
మద్యం విధానం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ ప్రస్తుతం తిహాడ్ జైలులో ఉన్న భారాస ఎమ్మెల్సీ కవిత అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను దిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆస్పత్రి కి తరలించి చికిత్స అందించారు. జ్వరం, గైనిక్ సమస్యలతో బాధపడుతుండటంతో ఆమెను మంగళవారం సాయంత్రం ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు వెల్లడించారు. వైద్య పరీక్షల అనంతరం తిరిగి జైలుకు తీసుకొచ్చినట్లు తెలిపారు. దిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 15న ఈడీ అధికారులు కవితను అరెస్టు చేశారు. ఆ తర్వాత ఏప్రిల్ 11న సీబీఐ అధికారులు ఆమెను జైలులోనే అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దీంతో దాదాపు నాలుగు నెలలుగా కవిత జైలులోనే ఉన్నారు.

# మళ్లీ ఉద్యమిస్తాం

- మా నిరసనలు ఆగవు..
- దిల్లీకి మళ్లీ ర్యాలీ చేపడతాం బీకేయూ

దిల్లీ (ప్రజా మంటలు):
దేశ రాజధాని దిల్లీ సరిహద్దులో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. పంజాబ్–హరియాణా సరిహద్దులోని శంభూ ప్రాంతంలో జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన అడ్డుకట్టల్ని తొలగించగానే..దిల్లీకి ర్యాలీ చేపట్టే యోచనలో ఉన్నట్లు భారతీయ కిసాన్ యూనియన్ నేతలు చెబుతున్నారు. జంతర్‌మంతర్‌లో గానీ, రామ్‌లీలా మైదానంలో గానీ శాంతియుత నిరసనకు దిగుతామన్నారు. ఈసారి తమను అడ్డుకున్నా, రహదారిపై బారికేడ్లు ఏర్పాటుచేసినా.. హరియాణా ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీకేయూ స్పష్టం చేసింది. పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంతోపాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేంద్రానికి వ్యతిరేకంగా రైతులు గత కొన్నాళ్లుగా నిరసన చేపడుతున్న విషయం తెలిసిందే. ఉద్యమంలో భాగంగా ఫిబ్రవరిలో రైతులు చేపట్టిన 'చలో దిల్లీ' కార్యక్రమాన్ని భద్రతా బలగాలు అడ్డుకోవడంతో ఘర్షణ తలెత్తింది. అప్పటినుంచి హరియాణా సరిహద్దులోనే శిబిరాలను ఏర్పాటుచేసుకొని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఘర్షణల నేపథ్యంలో శంబు సరిహద్దు వద్ద అధికారులు రోడ్డును మూసివేసి, రాకపోకలు నిలిపివేశారు. దీనిపై విచారణ చేపట్టిన పంజాబ్– హరియాణా హైకోర్టు.. ప్రయాణికుల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకొని రహదారిపై ఏర్పాటుచేసిన అడ్డంకుల్ని తొలగించాలని ఆదేశించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ హరియాణా ప్రభుత్వం.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. జాతీయ రహదారుల్ని దిగ్బంధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదంటూ.. అడ్డంకుల్ని తొలగించాలని నాలుగు రోజుల క్రితం తీర్పునిచ్చింది. ఈనేపథ్యంలో రోడ్డుపై అడ్డంకుల్ని తొలగించడం అనివార్యమైందిసులు సిద్ధమవుతున్నారు. మరోవైపు మార్చిలో ఆందోళనలు నిర్వహించిన సమయంలో అరెస్టయిన నవ్‌దీప్‌సింగ్‌కు సంఘీభావంగా బుధ, గురువారం అంబాలాలో శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు భారతీయ కిసాన్ యూనియన్ ప్రకటించింది. ఫిబ్రవరిలో రైతులు, భద్రతా బలగాల మధ్య తలెత్తిన ఘర్షణల్లో శుభ్‌కరణ్ సింగ్ అనే యువ రైతు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒక వేళ రైతులు మళ్లీ 'చలో దిల్లీ'కి పిలుపునిస్తే.. పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉంది.




# గాజాపై మరోసారి విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

- 'సేఫ్ జోన్'లో బాంబుల వర్షం.. 60 మంది మృతి!

గాజాస్ట్రిప్ (ప్రజా మంటలు):
హమాస్ ఉగ్రవాదుల అంతమే లక్ష్యంగా గాజాపై మరోసారి ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. దీంతో ఒక్కరాత్రే 60 మంది పాలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోయారు. సురక్షిత జోన్‌గా ప్రకటించిన ప్రాంతాలనూ వదల్లేదు. ఇక్కడా 17 మంది పాలస్తీనీయన్లు చనిపోయినట్లు గాజా ఆరోగ్య విభాగం వెల్లడించింది. దక్షిణ గాజా నగరం ఖాన్ యూనిస్ శివారులోని మువాసీ ప్రాంతం ప్రాంతాన్ని 'సేఫ్ జోన్'గా పరిగణిస్తున్నారు. ఇజ్రాయెల్ దాడులతో ఇక్కడ ఆశ్రయం పొందేందుకు వచ్చిన వేలాది మంది శరణార్థులు ఈ ప్రాంతంలో ఉన్నారు. ఐడీఎఫ్ కూడా ఈ ప్రాంతాన్ని తమ 'సేఫ్ జోన్' జాబితాలో చేర్చినట్లు ఇటీవల ప్రకటించింది. నిరాశ్రయులు ఇక్కడే ఉండొచ్చని సూచించింది. ఓ గ్యాస్ స్టేషన్‌కు సమీపంలో ఏర్పాటు చేసుకున్న గుడారాలపైనా భీకర దాడులు జరిపింది. సేఫ్ జోన్‌లోనే 17 మంది మృతి చెందినట్లు ఖాన్ యూనిస్‌లోని నాజర్ ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. దీంతో ఒక్క రాత్రిలో జరిగిన దాడుల కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 60కి చేరుకున్నట్లు గాజా ఆరోగ్య విభాగం పేర్కొంది. ఇదే ప్రాంతంలో శనివారం జరిపిన దాడిలో 90 మంది పాలస్తీనీయన్లు చనిపోగా.. 200 మందికి పైగా గాయాలయ్యాయి. ఇలా సురక్షిత ప్రాంతంలో దాడులు జరపడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# మిలిటెంట్ల ఏరివేతకు ఆర్మీకి పూర్తి స్వేచ్ఛ

- రాజ్‌నాథ్




శ్రీనగర్ (ప్రజా మంటలు):
జమ్మూ–కాశ్మీర్‌లోని దోడాలో ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు భారత ఆర్మీ సైనికులు వీరమరణం పొందిన నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రంగంలోకి దిగారు. ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీతో మాట్లాడారు. నలుగురు సైనికులు అమరులు అయిన నేపథ్యంలో ఎలాంటి చర్యలైనా తీసుకునేందుకు స్వేచ్ఛ ఇస్తున్నట్టు ఆర్మీ చీఫ్‌కు రక్షణమంత్రి చెప్పారు. ఇక ఎన్‌కౌంటర్‌కు సంబంధించి దోడాలో పరిస్థితులు, కొనసాగుతున్న ఆపరేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. కాశ్మీర్‌లోని దోడా జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున సాయుధ ఉగ్రవాదులతో భారత ఆర్మీ, జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక పోలీసు బలగాలు సంయుక్తంగా ఎన్‌కౌంటర్ ఆపరేషన్ చేశారు. అయితే ఈ ఆపరేషన్‌లో ఒక అధికారితో సహా నలుగురు సైనికులు అసువులు బాశారు. పలువురికి గాయాలు అయినట్టు ఆర్మీ వర్గాలు తెలిపాయి. రాత్రి 9 గంటల సమయంలో ఎన్‌కౌంటర్ మొదలైంది. అయితే ఉగ్రవాదులు దొంగదెబ్బ తీయడంతో నలుగురు జవాన్లు కోల్పోవాల్సి వచ్చిందని తెలుస్తోంది. జమ్మూ ప్రాంతంలో ఇటీవల జరిగి రెండో అతిపెద్ద దాడి ఇదేనని అధికారులు చెబుతున్నారు. గతవారం కథువాలో ఐదుగురు సైనికులు మరణించారని, ఆ తర్వాత ఇదే అతిపెద్ద ఎన్‌కౌంటర్ అని చెప్పారు. కాగా జమ్మూ ప్రాంతంలో తీవ్రవాదాన్ని నిర్మూలించేందుకు ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పూర్తి స్థాయిలో చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ గత నెలలో ఆర్మీని కోరారు. దీంతో బలగాలు రంగంలోకి దిగి జల్లెడ పడుతూ ఉగ్రమూకలను ఏరివేస్తున్నాయి.

# జులై 21న అఖిలపక్ష సమావేశం..

దిల్లీ (ప్రజా మంటలు):
వచ్చే సోమవారం నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో జులై 21 (ఆదివారం)న అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. అన్ని పార్టీలకు చెందిన ఫ్లోర్ లీడర్లు ఈ భేటీకి హాజరైనట్లయితే.. ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ హాజరుకావడం ఇదే తొలిసారి కానుంది. అయితే, ఈ సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్ గైర్హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. జులై 21న ఆ పార్టీ అమరవీరుల దినోత్సవంగా పాటిస్తున్నందున తమ ప్రతినిధులు ఈ భేటీకి హాజరుకావడం లేదని టీఎంసీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 22న మొదలై ఆగస్టు 12 వరకు కొనసాగనున్నాయి. జులై 23న పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఇటీవల కొత్తగా ఏర్పాటైన 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 24 నుంచి దాదాపు వారం రోజుల పాటు కొనసాగిన విషయం తెలిసిందే. ఈ సమావేశాల్లో ఉభయసభల్లోనూ అధికార, విపక్షాల మధ్య వాడీవేడీగా వాదనలు కొనసాగాయి. కొద్దిరోజులే సభ కొనసాగడంతో కొత్త సభ్యుల ప్రమాణస్వీకారానికి సగం టైం సరిపోయింది. దీంతో బడ్జెట్ ప్రవేశపెట్టడం కుదరలేదు. అందువల్ల ఈ నెల 23న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పూర్తిస్థాయి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దీంతో వరుసగా ఏడుసార్లు బడ్జెట్ సమర్పించిన ఘనతను ఆమె దక్కించుకోనున్నారు. ఇప్పటివరకు వరుసగా ఆరుసార్లు బడ్జెట్ సమర్పించిన ఘనత మొరార్జీ దేశాయ్ పేరిట ఉండగా.. ఆ రికార్డును నిర్మలా సీతారామన్ అధిగమించనున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TEL-TEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com